



చిగురిస్తున్న ఆశలు


ఎట్టకేలకు దేవాదుల పథకం పూర్తికి సర్కారు కసరత్తు

దేవాదులపై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తుండటంతో చివరి ఆయకట్టు వరకు గోదావరి జలాలు అందుతాయనే ఆశ రైతాంగంలో కలుగుతోంది. ఓరుగల్లును సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దేవాదుల పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, దేవాదుల నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. అయితే మొదటి, రెండో దశ పనులు పూర్తయినప్పటికీ కీలకమైన మూడో దశ పనులకు భూ సేకరణ అడ్డంకిగా మారింది. పెండింగ్‌లో ఉన్న 2,869 ఎకరాల భూ సేకరణతో పాటు 767కి.మీ గ్రావిటీ కెనాల్ నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ప్రభుత్వం నీటిపారుదలశాఖ అధికారులపై ఒత్తిడి తెస్తోంది. అలాగే కొత్తగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా ఎస్సారెస్పీ-2 కింద దేవాదుల ద్వారా గోదావరి జలాలను అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

2003 జూన్ 16న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రూ.4,400 కోట్ల అంచనా వ్యయంతో దేవాదుల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అయితే ఈపీసీ విధానంలో పిలిచిన టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. దేవాదుల ప్రాజెక్టును రీడిజైన్ చేసింది. మూడు దశల్లో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకుని ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.4,400 కోట్ల నుంచి రూ.6,016 కోట్లకు పెంచి పనులు ప్రారంభించింది. ఆ తరువాత పనుల్లో జాప్యం జరగడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరలు సైతం భారీగా పెరగడంతో 2008లో మరోసారి అంచనా వ్యయాన్ని రూ.9,427.23కోట్లకు పెంచారు. ఆ తరువాత 2017లో అప్పటి సీఎం కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును రీ డిజైన్ చేయటంతో భారీగా ఖర్చు పెరిగింది. దీంతో రూ.13,445.44కోట్లకు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని మరోసారి పెంచారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో దేవాదులను చేర్చి, రైతాంగానికి సాగునీరు అందించేందుకు పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు ప్రయత్నాలు చేపట్టింది. అందులో భాగంగా అంచనా వ్యయాన్ని రూ.18,055 కోట్లకు పెంచింది. మొత్తంగా ఇప్పటివరకు దేవాదుల ప్రాజెక్టుపై రూ.14,269.63 కోట్ల వరకు ఖర్చు చేసింది. అయితే ప్రాజెక్టు పూర్తికావడానికి ఇంకా రూ.4,230 కోట్లు అవసరంగా ప్రభుత్వం గుర్తించింది. 2005-06 నుంచి 2025-06 ఆర్థిక సంవత్సరం వరకు అంటే.. పాతికేళ్లలో దేవాదుల అంచనా వ్యయం సుమారు రూ.12వేల కోట్లకు పైగా పెరిగింది. తొలుత 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 5,56,722 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలిదశ నుంచి మూడు రిజర్వాయర్లను, నాలుగు పంపుహౌ‌ఎల ద్వారా 5.18టీఎంసీల నీటిని లిఫ్టు చేసి, 1,23,768 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. రెండో దశలో 9రిజర్వాయర్లు, ఏడు పంపుహౌస్‌ల ద్వారా 7.25టీఎంసీల నీటిని ఎత్తిపోసి 1,93,164 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఇక కీలకమైన మూడో దశ పనులు పూర్తి అయితే 10 పంపుహౌ‌ఎల ద్వారా 25.75 టీఎంసీల నీటిని లిఫ్టుచేసి 2,39,790 ఎకరాలకు సాగునీరు అందనుంది. మొత్తం దేవాదుల ప్రాజెక్టు ద్వారా 170 రోజుల్లో 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 5,56,722 ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీటితో పాటు భూగర్భ జలాలతో సాగులో ఉన్నా 58,028 ఎకరాలను కలుపుకుంటే మొత్తంగా దేవాదుల ద్వారా 6.14 లక్షల ఎకరకాలకు సాగునీరు అందించట్లు అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.



దేవాదుల వద్ద ఇన్‌టెక్‌వెల్ (ఫైల్)

ఎస్సారెస్పీ-2కు దేవాదుల నీళ్లే..

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు రెండు దశల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ-1 కింద 3,64,078 ఎకరాల్లో, ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టు ఉందని అంచనా. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఈ ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా గత ప్రభుత్వం పేర్కొంది. అయితే సమ్మక్క సాగర్ నిర్మాణంతో దేవాదుల ఎత్తిపోతల కింద కొత్త ఆయకట్టును ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీంతో ఎస్సారెస్పీ-2 కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి డీపీఆర్‌లో చూపించింది. రెండు ప్రాజెక్టుల కింద ఎస్సారెస్పీ ఆయకట్టును చూపించటంతో సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు నిలిచిపోవటంతో ప్రత్యామ్నాయంగా దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ప్రభుత్వం సీడబ్ల్యూసీ అనుమతి పొందింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పాలకుర్తి నియోజకవర్గంలో 44,942 ఎకరాలు, వర్ధన్నపేటలో 9,012 ఎకరాలు, డోర్నకల్‌లో 55,558 ఎకరాలకు ఎస్సారెస్పీ-2 ద్వారా గోదావరి జలాలు అందుతున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టుకు దేవాదుల ద్వారా గోదావరి జలాలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

భూ సేకరణే అడ్డంకి..

దేవాదుల ఎత్తిపోతలకు ప్రధాన అడ్డంకిగా భూసేకరణ ఉంది. మూడు దశల్లో దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం

(మిగతా 7లో..)

- పాతికేళ్లుగా సా..గుతున్న ప్రతిష్ఠాత్మక ఎత్తిపోతల పథకం
- ప్రాజెక్టుకు సవాల్‌గా మారిన భూ సేకరణ
- ఇంకా 2,869 ఎకరాల భూసేకరణ.. 767 కి.మీ. గ్రావిటీ కెనాల్ నిర్మాణం పెండింగ్
- 5.56 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం కాగా, 3.17 లక్షల ఎకరాలకే సాగునీరు
- ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యంతో భారీగా పెరుగుతున్న దేవాదుల వ్యయం
- రూ.6,016 కోట్లతో ప్రారంభమై.. రూ.18,055 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- ఎస్సారెస్పీ-2 కింద ఉన్న ఆయకట్టుకు కూడా ఇక దేవాదుల నీళ్లే



కాటారంలో బాణసంచా కాల్చుతున్న మహిళలు

ఆనందాల హరివిల్లు

- ఇంటింటా దీపావళి
- అంబరాన్నంటిన సంబురాలు
- శ్రీలక్ష్మికి ప్రత్యేక పూజలు



భూపాలపల్లిలో పూజా సామగ్రి

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలో ప్రతి ఇంటా ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపాలు వెలిగించారు. బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా వేడుకల్లో పాల్గొన్నారు. భూపాలపల్లి పట్టణంలోని 30వార్డులు సహా, జిల్లాలోని 12 మండలాల్లోని 248 గ్రామాల్లో దీపావళి ఘనంగా జరిగింది. ఉదయాన్నే స్నానం ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి, ఇంట్లో శ్రీ లక్ష్మికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాత్రి అరటితోరణాలతో ఇంటిముందు అలంకరించి దీపాలు వెలిగించారు. కుటుంబ సమేతంగా టపాసులు కాల్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు ఉపవాస దీక్ష చేశారు. సాయంత్రం పాలపాయసం తయారు చేసుకుని విందు ఆరగించారు. కొంతమంది సోమవారమే నోములు చేసుకోగా మరికొందరు మంగళవారం ఆచరించారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 1.23లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా, అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 2.40మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నలుగురు మావోయిస్టుల లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన ములుగు ఎస్పీ శబరీశ్
- తక్షణ సాయం కింద రూ. 25 వేల చొప్పున అందజేత



లొంగిపోయిన మావోయిస్టు కమాండర్‌కు నగదు అందిస్తున్న జిల్లా ఎస్పీ శబరీశ్

ములుగు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు పోలీసుల ఎదుట నలుగురు మావోయిస్టులు లొంగిపోయారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శబరీశ్ ఈ మేరకు వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ఒకరు మిలీషియా సభ్యుడు ఉండగా, మరో ముగ్గురు దళ సభ్యులు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన మావోయిస్టు మిలీషియా కమాండర్ మడకం బంది, దళ సభ్యులు మడావి కోసి, మడావి ఎడుమే, తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన ముచకి దేవ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరు కొన్నేళ్లుగా మావోయిస్టు పార్టీలో కొనసాగుతూ పలు ఘటనల్లో పాల్గొన్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు మహిళలు ఉండగా, ఇద్దరు పురుషులు ఉన్నారు.

'మన ఊరికి తిరిగి రండి'కి విశేష స్పందనమ

ములుగు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన నలుగురు మావోయిస్టులకు తక్షణ సహాయం కింద రూ. 25వేల చొప్పున అందిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఆదివాసి ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం 'పోరు కన్నా ఊరు మిన్న- మన ఊరికి తిరిగి రండి' అనే నినాదంతో పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న పిలుపు మేరకు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవడం శుభపరిణామం అన్నారు. వీరికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం పునరావాసం, పరిహారం అందిస్తోందని తెలిపారు. ములుగు జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 84మంది మాయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారని అన్నారు.

వీరిలో ముగ్గురు డీడీసీఎం, 11మంది ఏసీఎం కేడర్ కాగా, 28 మంది పార్టీ సభ్యులు, 32మంది మిలీషియా సభ్యులు, ఒకరు ఆర్పీసీ మెంబర్, ఇద్దరు డీఏకేఎమెస్/ కేఏఎంఎస్ సభ్యులు, ఏడుగురు సీఎన్ఎం సభ్యులు ఉన్నారని వివరించారు. మావోయిస్టు పార్టీ బలహీనపడుతోందని, దీంతో అనేక మంది అడవి బాట వీడి ప్రశాంత జీవితం గడిపేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు.

కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

వెంకటాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపురం గ్రామ సమీపంలో కోడిపందేల స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించినట్టు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు. తమకు అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి తిప్పాపురం గ్రామంలో కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించామని ఆయన వెల్లడించారు. ఈదాడుల్లో 26 ద్విచక్రవాహనాలు, మూడు కోడి పుంజులు, 8 కత్తులను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

సిటిజన్ సర్వేలో పాల్గొనాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ -2047 సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలని కలెక్టర్ రాహుల్‌శర్మ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పన కోసం తెలంగాణ రైజింగ్ -2047 సిటి జన్ సర్వేను చేపట్టగా, ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చి 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టిందని తెలిపారు. ఈనెల 25తో ఇది ముగుస్తుందని, ప్రజలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ. జీవోవీ. ఇన్/తెలంగాణరైజింగ్‌అనే వెబ్‌సైట్‌ను సందర్శించి సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ కోరారు.



గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వెంకటాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలుబాక గ్రామ సమీపంలోని గోదావరినదిలో రెండురోజుల క్రితం గల్లంతైన పాషా మృతదేహం మంగళవారం లభ్యమైంది. రెండురోజుల క్రితం పాషా గోదావరి లంకల్లో సాగుచేస్తున్న పుచ్చతోటను చూసేందుకు వెళ్లి గోదావరిలో గల్లంతయ్యాడు.

కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందిస్తున్న ఎమ్మెల్యే, ఎస్పీ, డీఎఫ్‌వో

కృష్ణకాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం ఘటనంగా నిర్వహించారు. ఎస్పీ కిరణ్‌ఖరే, అటవీ శాఖ జిల్లా అధికారి (డీఎఫ్‌వో) నవీన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలంతా స్వేచ్ఛగా, భయరహితంగా జీవించగలుగుతున్నారంటే అది పోలీసులు ఉన్నారనే ధైర్యంతోనే అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లను ఎదుర్కొన్నా ప్రజల రక్షణలో పోలీసులు వెనుకడుగు వేయరని కొనియాడారు. అనంతరంరక్తదాన శిబిరాన్ని ఎమ్మెలే ప్రారం భించారు.ఈ సందర్భంగా ఎస్పీతోపాటు పలువురు రక్తదానం చేయగా ఎమ్మెల్యే అభినందించారు.

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ

పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. విధి నిర్వహణలో ప్రజలకు సేవ చేస్తూ ప్రాణత్యాగం చేసిన నిజమైన వీరులను స్మరించుకునే రోజు అక్టోబరు 21 అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అటవీశాఖ అధికారి నవీన్‌రెడ్డితో కలిసి అమరవీరల స్థూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, జిల్లా పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



భార్య కాపురానికి రావడం లేదని..

చెరువులో దూకి భర్త ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

గణపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంపల్లికి చెందిన మంగ నరేష్ (35) భాగ్యలక్ష్మికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాలుగేళ్లుగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి.

దీంతో భార్య భాగ్యలక్ష్మి తన పుట్టింటికి వెళ్లి ఆరు నెలలుగా అక్కడే ఉంటోంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నరేష్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే బస్వరాజుపల్లిలోని జగ్గమ్మకుంటలో ఓ వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతి చెందిన వ్యక్తి నరేష్ అని గుర్తించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి



సింధూజ (ఫైల్)

కన్నాయిగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కారు, ద్విచక్ర వాహనం ఢీకొని విద్యార్థిని మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సర్వాయి పంచాయతీ పరిధి చిట్యాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై ఇనిగాల వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల గ్రామానికి చెందిన బొచ్చు బక్కయ్య, క్రిష్ణవేణి పెద్ద కూతురు సింధూజ (17) ములుగులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె జ్వరం బారిన పడింది. దీంతో అదే గ్రామానికి చెందిన సమీప బంధువు ద్విచక్ర వాహనంపై తన చెల్లితో కలిసి కన్నాయిగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రికి బయల్దేరింది. ఈ క్రమంలో మార్గ మధ్యలో ఎదురుగా వస్తున్న కారు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన సింధూజ అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. మృతురాలి తల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జనగామలో 25న నిర్వహించే పత్తి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ మూడ్ శోభన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. శోభన్ మాట్లాడుతూ కేంద్రం పత్తికి మద్దతు ధర రూ. 7,710 ప్రకటించగా నేటి వరకు సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. కపాస్ కిసాన్ యాప్‌పై రైతులను చైతన్యం పర్చుకుండా కేంద్ర ప్రభుత్వం పత్తి రైతుల నడ్డి విరుస్తుందని వెంటనే ఈ యాప్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భూక్య చందు నాయక్, మంగ బీరయ్య, కర్రె రాములు, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి రూ.50 కోట్లు



భూపాలపల్లి అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.50కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబురాలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణాన్ని ఆధునిక మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ఈ నిధులతో రోడ్లు, కాల్వల నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారం చేయడమే కాకుండా పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రధానంగా జయశంకర్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, గణేష్ చౌరస్తా, హనుమాన్ జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ విస్తరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) పథకం ద్వారా రూ.23 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతాయని వెల్లడించారు. అలాగే భూపాలపల్లి పట్టణంలో అంబేద్కర్ భవనానికి రూ. 5కోట్లు, గిరిజన భవనానికి రూ. కోటి వెచ్చించామని తెలిపారు. ఈ నిధులు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ నాయకులు దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, శ్రీనివాస్, రవీందర్, అనిల్, సాంబమూర్తి, కొంరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరులకు ఘన నివాళి



పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న జిల్లా పోలీస్ అధికారులు

ములుగు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని హెడ్‌క్వార్టర్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. అమరుల స్థూపం వద్ద ఎస్పీ శబరీశ్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు తన ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల భద్రతకు పాటుపడుతారని అన్నారు. మారుమూల అటవీ ప్రాంతమైన ములుగు మావోయిస్టు ప్రభావిత జిల్లా అని, అయినప్పటికీ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను అరికట్టడంలో పోలీసులు సమర్థంగా పనిచేస్తున్నారని అన్నారు. వరదలు, ప్రకృతి వైపరీత్యాలు లాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం చేయడంలో ముందుంటారని కొనియాడారు. పోలీసు అమరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు తోడుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం అమరుల స్మారక స్థూపం వద్ద సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు డీఎస్పీ రవీందర్, డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్ కుమార్, సీఐలు శ్రీనివాస్, దయాకర్, సురేష్, రమేష్, ఆర్ఐలు స్వామి, సంతోష్, తిరుపతి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ జాయింట్ సెక్రటరీగా గణేష్



స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ హన్మకొండ జిల్లా జాయింట్ సెక్రటరీగా మండలంలోని తానేధార్‌పల్లి గ్రామానికి చెందిన ఉడుత గణేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మెరుగు రమేష్ మంగళవారం గణేష్‌కు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ తాను ఎంపిక కావడానికి సహకరించిన రాష్ట్ర కమిటీ బాధ్యులకు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బక్కి వంశీకి కృతజ్ఞతలు తెలిపారు.



శిల్పకళా సంపద గురించి వివరిస్తున్న గైడ్

రామప్పను సందర్శించిన సినీ నటుడు

వెంకటాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సినీ నటుడు గురురాజ్ మానేపల్లి మంగళవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఉమాశంకర్, హరీష్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. శిల్పకళా సంపదను వీక్షించిన సినీ నటుడు, ఆయన కుటుంబ సభ్యులు ఆలయ చరిత్ర, విశిష్టతను గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



టిప్పర్ల టైర్లలో గాలితీసి, నిరసన తెలుపుతున్న ఇప్పగూడెంవాసులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇప్పగూడెం గ్రామశివారులోని, కుర్చపల్లికి వెళ్లే రోడ్డులో ఉన్న మట్టిఏనెల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకొని వాటి టైర్లలో గాలితీసివేసి నిరసన వ్యక్తం చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. నిరసనకారులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా 50 నుంచి 60 టన్నుల లోడ్‌తో టిప్పర్లను గ్రామంలో రోడ్లమీదుగా నడుపడడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, మిషన్ భగీరథ పైపులైన్లు పగిలిపోయి, తాగునీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల రూ.70లక్షలతో వేసిన రోడ్డుకు పగుళ్లు వస్తున్నాయన్నారు. సోమవారం తెల్లవారుజామున 12టిప్పర్లు మట్టిని తరలిస్తుండగా 9 టిప్పర్లు తప్పించుకొని వెళ్లగా 3టిప్పర్లను పట్టుకొని గాలితీయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగనబోయిన శ్రీనివాస్, ఎమ్డీ షాబుద్దీన్, ఎమ్డీ యాకుబ్ పాషా, గొడిశాల యాదగిరి, జిట్టబోయిన వెంకటయ్య, న్యాయం చిరంజీవి, మేకల రాజు, మర్రి రవి, రాజు, యాదగిరి, చేరాలు, నాగయ్య, మునిగెల సోమేశ్వర్, నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థినుల గొంతుపై గాట్లు

ఎస్సీ గురుకులంలో వెలుగు చూసిన ఘటన



ఓ బాలిక గొంతుపై పడిన గాట్లు

కాటారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దామెరకుంట ఎస్సీ బాలికల గురుకులంలో రాత్రిపూట పడుకున్న ముగ్గురు ఆరో తరగతి విద్యార్థినుల గొంతుపై గాట్లు పడ్డ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం ఓ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడంతో ఈ ఘటన ఎలా జరిగిందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కాటారం మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థిని తండ్రి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐదు రోజుల క్రితం విద్యార్థినులు అందరూ భోజనం చేసిన తర్వాత క్లాసుల వారీగా నిద్రపోయారు. ఉదయం లేచిన ముగ్గురు విద్యార్థినులు స్నానం చేస్తుండగా గొంతుపై మంట రావడంతోపాటు రక్తం కనిపించింది. దీంతో ఈ విషయాన్ని హౌస్ మేడం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రిన్సిపాల్ ఆదేశాలతో విద్యార్థినులను పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించి గురుకులానికి తిరిగి తీసుకొచ్చారు.

దీపావళి పండుగ కోసమని విద్యార్థినులు ఇంటికి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు ఆదివారం సాయంత్రం గురుకులం వెళ్లగా పిల్లలు ఈ ఘటన విషయాన్ని వారికి వివరించారు. గొంతులపై బ్లేడ్‌తో కోసి ఉన్న గాట్లు ఉండగా, ఇదెవరు చేశారు.. ఏం జరిగిందని ఆరా తీయగా తమకేం తెలియదని, తెల్లవారి లేచి చూసుకునేసరికి ఇలా ఉందని తెలపడంతో తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురయ్యారు. దీనిపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. ఇంత పెద్ద విషయాన్ని కూడా తమ వద్ద ఎలా దాచారని నిలదీశారు. అనంతరం తమ పిల్లలను ఇంటికి తీసుకొచ్చుకొని సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే.. విద్యార్థినుల మధ్య జరిగిన గొడవలో ఇలా జరిగిందా.. లేక ఇంకేమైనా కారణాలున్నాయా? అనే విషయం తేలాల్సి ఉంది. దీనిపై ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మిని అడగగా విద్యార్థినులు ఉదయం స్నానం చేసే సమయంలో గొంతుపై గీరుకున్నట్లుగా ఉందని చెప్పడంతో ట్రీట్ మెంట్ చేయించామని చెప్పారు. రాత్రి ఏం జరిగిందో తమకు తెలియదని చెప్పారని వివరించారు. ఈ క్రమంలో డీసీపీవోతో పాటు పోలీస్ అధికారులు గురుకులాన్ని బుధవారం సందర్శించి, విచారణ చేపట్టనున్నట్టు సమాచారం.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

దంపతులకు గాయాలు

గణపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని దంపతులు ఇద్దరికి గాయాలైన సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మారెడ్డిపల్లికి చెందిన కనుకుంట్ల రామ్మూర్తి, ఆయన భార్య పరకాలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారి కాలనీ వద్ద మలుపు తిరుగుతున్న క్రమంలో వెనకాలే వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. దీంతో రామ్మూర్తి, ఆయన భార్య గాయపడ్డారు. వీరిని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



ఎంజేపీటీబీసీ పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

జనగామ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో మల్లికార్జున రావు సూచించారు. పెంబర్తి ఎంజేపీటీబీసీ వేల్ఫేర్ పాఠశాల, కళాశాలను డీఎంహెచ్‌వో పరిశీలించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత పరీక్షలపై దృష్టి సారించారన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్య ప్రొఫైల్ కార్డులను సిద్ధం చేయాలని ఆర్‌బీఎస్‌కే సిబ్బందికి సూచించారు.

యశస్విని వర్సెస్ కృష్ణమూర్తి

● వేదికపై వాగ్వాదం ● ఇరువర్గాల కార్యకర్తల ఘర్షణ



సమావేశంలో కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం, ఘర్షణ

దేవరుప్పుల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : దేవరుప్పుల రైతు వేదిక వద్ద మంగళవారం రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నేత, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పరిస్థితి వేడెక్కింది. కార్యక్రమంలో ప్రసంగించిన కృష్ణమూర్తి గౌడ్ రైతులకు ఏ చిన్న అన్యాయం జరిగినా, ఇబ్బందులు తలెత్తినా ఊరుకునేది లేదన్నారు. మా పార్టీ ఎమ్మెల్యే అయినా సరే.. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదంటూ ప్రభుత్వానికి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కృష్ణమూర్తి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆమె పెద్ది ప్రసంగాన్ని అడ్డుకుంటూ.. అతని వద్ద నుంచి మైక్ లాక్కోండి అంటూ అధికారులను ఆదేశించారు. దీంతో వేదికపై ఉన్న ఎమ్మెల్యే, కృష్ణమూర్తి వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. నువ్వెంత అంటే.. నువ్వెంత అనుకుంటూ మాటల యుద్ధం కొనసాగింది. రైతుల సమక్షంలోనే సొంత పార్టీ నాయకుల మధ్య ఘర్షణ జరగడం మండలంలో చర్చనీయాంశమైంది.

అడవి దున్న దాడిలో వ్యక్తి మృతి



కార్లాయిలో గోవిందు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

కొత్తగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అడవి దున్న దాడిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కార్లాయి గ్రామంలో జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కార్లాయి గ్రామానికి చెందిన కల్తీ గోవిందు(50) మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18(శనివారం)న మేకలు మేపేందుకు అడవిలోకి వెళ్లాడు. సాయంత్రం మేకలు తిరిగి గ్రామానికి వచ్చాయి కానీ గోవిందు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గోవిందు కోసం అడవిలో గాలించగా సోమవారం కుళ్లిన స్థితిలో ఉన్న గోవిందు మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే విషయాన్ని గ్రామస్తులు పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడంతో సంఘటన స్థలానికి చేరుకుని ఎస్సై రాజ్‌కుమార్ విచారణ చేపట్టారు. గోవింద్ మృతదేహం పక్కన అడవిదున్న పిల్ల మృతదేహం ఉండడంతో గోవిందు అడవిదున్న మృతదేహాన్ని పరిశీలిస్తుండగా తల్లి అడవి దున్న జరిపిన దాడిలో గోవిందు మృతి చెందినట్టు నిర్ధారణకు వచ్చారు. మృతుడికి భార్య పద్మ ఉన్నారు. మృతుడి మరదలు కుమారుడు పిడబోయిన సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

దీపావళి రద్దీ దృష్ట్యా కాజీపేట మీదుగా స్పెషల్ రైళ్లు

కాజీపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి రద్దీని పురస్కరించుకుని కాజీపేట మీదుగా పలు స్పెషల్ రైళ్లను నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 23, 28తేదీలలో (070 91) చర్లపల్లి - దానాపూర్ మధ్య నడిచే ఈ స్పెషల్ రైలు ఈ నెల 28, 29 తేదీలలో చర్లపల్లిలో ఉదయం 9.30 నిమిషాలకు బయలు దేరి తరువాత రోజు రాత్రి 7.45 నిమిషాలకు దానాపూర్‌కు చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు (07092) దానాపూర్ - చర్లపల్లి మధ్య ఈ నెల 24, 29 తేదీల్లో దానాపూర్‌లో రాత్రి 9:15 నిమిషాలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30 నిమిషాలకు చర్లపల్లికి చేరుకుంటుంది.

(07049) చర్లపల్లి - దానాపూర్ మధ్య నడిచే మరో స్పెషల్ రైలు ఈ నెల 26న చర్లపల్లిలో ఉదయం 9:30 నిమిషాలకు బయలుదేరి మరసటిరోజు రాత్రి 7:45 నిమిషాలకు దానాపూర్‌కు చేరుకుంటుంది. (07050) దానాపూర్-చర్లపల్లి మధ్య నడిచే ఈ స్పెషల్ రైలు ఈ నెల 27న దానాపూర్‌లో రాత్రి 7:15 నిమిషాలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:30 నిమిషాలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైళ్లు కాజీపేట జంక్షన్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్లార్ష, నాగ్‌పూర్, ఇటార్సి, జబల్‌పూర్, కట్ని, మైహర్, సట్నా, ప్రయాగ్‌రాగ్, దీన్‌దయాల్ ఉపాధ్యాయ, బక్సర్, స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ ఒక ప్రకటనలో చెప్పారు.

23న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సాత్విక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీని అగ్రి ల్యాబ్స్‌లో వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఫీల్డ్ ఆఫీసర్ల పోస్టుల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. టెంత్, ఇంటర్, డిగ్రీ పాసై 18 నుంచి 45 ఏళ్ల మధ్యగల యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు గురువారం నాడు ములుగురోడ్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు 9121075429 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి వినతి

రాంనగర్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాక్ ఆధ్వర్యంలో మంగళవారం టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జాక్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న 23,667 మంది కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి పూర్తిస్థాయిలో రెగ్యులరైజ్ చేయకుండా ఆర్టిజన్‌లుగా గుర్తించి ఒకే సంస్థలో రెండు సర్వీసు రూల్స్‌ను ఆయా డిస్కంల యాజమాన్యాలు అమలుచేస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు.

రెగ్యులర్ ఉద్యోగులతో సమాన హక్కులు కల్పించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేసేందుకు సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ జాక్ చైర్మన్ సికిందర్, నాయకులు శ్రీకాంత్, రవీందర్‌రెడ్డి, తిరుపతి, జి.అనంతరెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీనువాస్, అశోక్, చింతలపూడి సతీష్‌కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



WANTED

★ హాస్పిటల్‌లో పని చేయుటకు ఫార్మసిస్ట్,ల్యాబ్ టెక్నీషన్ సిస్టర్స్ మరియు ఆయాలు (స్వీపర్స్) కావలెను. బేబీస్ లైఫ్ హాస్పిటల్ కాకాజీ కాలని హన్మకొండ. సంప్ర: 9032753764

AJW-243443

WANTED

★ హన్మకొండ, వరంగల్, కాజీపేట ఆఫీసులో పని చేయుటకు రిసెప్షనిస్ట్, టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సూపర్‌వైజర్స్, ఎగ్జిక్యూటివ్స్ ANM, GNM నర్సులు, డ్రైవర్స్, హౌస్‌కీపర్స్, సెక్యూరిటీగార్డ్స్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Salary :7000/- 15000/- సంప్ర: 7995732597, చైతన్య గ్రూప్ సర్వీసెస్, హన్మకొండ.

AJW-435

FLAT FOR SALE

★ Fathima Nagar, Near NIT, Apna Residency, Flat No-301, 2 BHK, 1000 sft. Flat for sale Contact : 8074874708

AJW-243533

TO-LET

★ హన్మకొండ అశోక కాంప్లెక్స్‌లో నిర్మాణం అవుతున్న 1080X4=4320 Sft గల నూతన కమర్షియల్ భవనం ఏదైనా ఆఫీస్‌లకు / షాపులకు కిరాయికి ఇవ్వబడును. సంప్ర: 7989508667, 9885312160

AJW-243530

CHANGE OF NAME

★ I, SHABEER ALI Alias MD.SHABBEER ALI S/o Late Mohammad ALI Alias Late Ali Mohammad Alias LATE MD.ALI (Old Name),Police constable -1143,EMP ID-2104703 at Commissionerate, Warangal Dist.T.S. I have changed my name MOHAMMAD SHABBEER ALI S/o LATE MOHAMMAD VALI (New Name) for all future purpose

AJW-257016

CHANGE OF NAME

★ I, YOHOSHUVANAYAK BANAVAT (Old Name), H.No: 10-39/46/4/2, Thatikonda, Ghanpur Station, Jangaon, T.G., Have Changed my Name from YOHOSHUVANAYAK BANAVAT to YOHOSHUVA NAYAK BANAVATH (New Name), S/o. KOTIYA NAYAK BANAVATH in all my Records

AJW-243532

CHANGE OF NAME

★ I, RAJANI KUMARI CHEDIPALLI (Old Name), H.No: 1-7-1295, 1st floor, Bheeshma Nagar, Hanumakonda, T.G., Have Changed my Name from RAJANI KUMARI CHEDIPALLI to RAJINI KUMARI CHEDIPALI (New Name), W/o. Venkata Ramana Chedipalli in all my Records

AJW-243532

CHANGE OF NAME

★ I, ARRABELLY BHASKAR (Old Name), H.No: 2-187, Chandupatla Wada, Parkal, Hanumakonda, T.G., Have Changed my name from ARRABELLY BHASKAR to ARRABELLI BHASKAR REDDY (New Name), S/o. ARRABELLI RAM REDDY in all my Records

AJW-243532

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
9985411677

వరంగల్
9949638376
9985408173

జనగామ
9866431354

మహబూబాబాద్
9985418040

తొర్రూర్
9985418040

నర్సంపేట
9949638376

భూపాలపల్లి
9985401232

పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

విద్యతో పాటు మానసిక ఆరోగ్యం

- నిట్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు
- విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ
- హార్ట్‌ఫుల్‌నెస్, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో ఎంవోయూ
- మానసిక ఆరోగ్య శిక్షణలో నిట్‌కు జాతీయ గుర్తింపు


జ్యోతి ప్రజ్వలన చేసి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, తదితరులు

హనుమకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (నిట్) విద్యార్థులు, అధ్యాపకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మానసిక ఆరోగ్యం, భావోద్వేగ స్థిరత్వం, సమగ్ర విద్యను ప్రోత్సహించే దిశగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యతో పాటు మానసిక ఆరోగ్యం పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోంది. సాధారణంగా ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకే ప్రాధాన్యం ఇస్తారు. ప్రామాణికమైన విద్యను అందించడంపైనే ప్రధానంగా దృష్టి పెడతారు. విద్యార్థులు, అధ్యాపకుల ఒత్తిడి, వారి మానసిక స్థితిగతులను పెద్దగా పట్టించుకోవు. కానీ వరంగల్ నిట్ ఇందుకు భిన్నంగా ఒక పక్క ప్రపంచస్థాయి ఉన్నత విద్యాప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూనే సమాజానికి మానసికంగా స్థిరత్వం, ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కొగలిగే స్థితప్రజ్ఞత, ధైర్యవంతులైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు మరోపక్క ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే నిట్ క్యాంపస్‌లో మానసిక ఆరోగ్య వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. కళాశాల వినూత్న కార్యక్రమాల్లో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు.

ఆరోగ్యకరమైన వాతావరణం

విద్యార్థులు, అధ్యాపకులకు ఆత్మీయ, మానసిక సమతుల్య వాతావరణాన్ని కల్పించడం ఈ కేంద్ర ప్రధాన లక్ష్యం. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020లో పేర్కొన్న మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ఒక ప్రధాన అంశాన్ని ఆచరణాత్మకం చేసేందుకు దీనిని ఏర్పాటు చేశారు. ఈ మానసిక ఆరోగ్యం, వెల్‌నెస్ సెంటర్‌కు గత సంవత్సరం ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్ (కన్హా శాంతి వనం)తో ఎంవోయూ కుదుర్చుకోవడంతోనే అంకురార్పణ జరిగింది. హార్ట్‌ఫుల్‌నెస్ పక్షాన ఈ ఒప్పందంపై రిటైర్డ్ డీజీపీ ఆదిత్య ఆర్య, డాక్టర్ అనంత మాధవ మోహన్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ధ్యానం, యోగాభ్యాసం, మానసిక ఒత్తిడి నియంత్రణ వంటి పద్ధతులను విద్యార్థులు, అధ్యాపకులు తమ దైనందిన జీవితంలో ఆచరించేట్లు చేయడం ఈ సెంటర్ ముఖ్య ఉద్దేశం.

జాతీయ గుర్తింపు

నిట్ వెల్‌నెస్ సెంటర్ మానసిక ఆరోగ్యం, భావోద్వేగాల నియంత్రణపై ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలకు జాతీయ గుర్తింపు లభించింది. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ నిర్వహించిన తొలి జాతీయ వెల్‌బీయింగ్ కాంక్లేవ్‌లో వరంగల్ నిట్ తన కార్యక్రమాలను ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఉన్నత విద్యా కార్యదర్శి సంజయ్ మూర్తి, విద్యా మంత్రిత్వశాఖ అధికారులు ఈ కార్యక్రమాలపై ప్రశంసలు కురిపించారు.

ధ్యానం, ఒత్తిడి నివారణలో శిక్షణ

ఈ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటైన తర్వాత విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక ఆరోగ్యాన్ని పెంచడానికి పలు ముఖ్యమైన కార్యక్రమాలు చేపట్టింది. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌తో కలిసి సుదర్శన క్రియ, మైండ్‌ఫుల్‌నెస్‌లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. అధ్యాపకుల కోసం ప్రత్యేకంగా బేర్‌ఫుట్ కౌన్సెలింగ్ వర్క్‌షాపు నిర్వహించింది. ఇందులో విద్యార్థులతో పాటు నిట్‌లో పని చేస్తున్న 150 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఎక్స్‌ప్రెషన్ ఇండియా సంస్థ డైరెక్టర్ జితేంద్ర నాగపాల్, డాక్టర్ గీతా మెహ్రోత్ర పాల్గొని భావోద్వేగ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు.

వెల్‌నెస్ కార్యకలాపాలు

నిట్ క్యాంపస్‌లో మానసిక ఆరోగ్య వెల్‌నెస్ సెంటర్ విద్యార్థులు, అధ్యాపకుల కోసం ప్రతి వారం ధ్యానం, యోగ అభ్యాసాలపై ఇస్తున్న శిక్షణకు మంచి స్పందన లభిస్తోంది. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. నిరంతరం మానసిక ఆరోగ్య శిక్షణా కార్యక్రమాలను కొనసాగించేందుకు వీలుగా వరంగల్ నిట్ 67వ వ్యవస్థాపక దినోత్సవం, ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10వ తేదీన వెల్‌నెస్ సెంటర్‌కు ప్రత్యేక హాల్‌ను కేటాయించారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి ఈ హాల్‌ను ప్రారంభించారు. ఈ యేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఇతి వృత్తం 'సంక్షోభాలు, అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యం- వివిధ సేవా రంగాల్లో అందుబాటు'. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ మెడికోవర్ ఆస్పత్రి డాక్టర్ ప్రియాంక మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. హైదరాబాద్ హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులు కూడా పాల్గొని ధ్యానంపై మార్గదర్శనం చేశారు. ఈ మానసిక శిక్షణా కార్యక్రమాలను కొనసాగించేందుకు ఈ యేడు మే 5న హార్ట్‌ఫుల్‌నెస్‌తో ఉన్న ఎంవోయూను మరో మూడేళ్లు నిట్ పొడిగించుకున్నది.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం

మానసిక ఆరోగ్యం అనేది నేర్చుకునే ప్రక్రియ మాత్రమే కాదు. జీవన గమనంలోనూ కీలకమైంది. ఈ కేంద్రం ద్వారా కరుణ, సమతుల్యత, ధైర్యం, మానసిక స్థితప్రజ్ఞత కలిగిన విద్యార్థులను సమాజానికి అందించాలన్నది మా లక్ష్యం. వరంగల్ నిట్ తన విశిష్టమైన కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ విద్యా వ్యవస్థలో సమగ్ర దృక్పథాన్ని తీసుకువస్తున్న అత్యున్నత విద్యా సంస్థగా నిలుస్తోంది.

నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి


సీతంపేటలో రేగడి మట్టిని సేకరిస్తున్న నేతకాని కులస్థులు

'దీపావళి బతుకమ్మ' షురూ

సీతంపేటలో నేడు జోడెద్దుల విగ్రహ ప్రతిమల నిమజ్జనం

హసన్‌పర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటలో దీపావళి అమావాస్య రోజు నుంచి మూడు రోజుల పాటు సాగే నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వారం నుంచే వివిధ రాష్ట్రాలలో స్థిరపడిన నేతకాని కులస్తులు, వారి కుటుంబ సభ్యులు సీతంపేటకు చేరుకోవడంతో సీతంపేటలో పండుగ వాతావరణం నెలకొంది. వేడుకల్లో మొదటి రోజు మంగళవారం ఉదయమే నేతకాని కులస్తులు ఉపవాస దీక్షతో ఊరు శివారులోని కుంటకు చేరుకొని రేగడి మట్టిని సేకరించి జోడెద్దుల విగ్రహ ప్రతిమలను తయారు చేశారు. పిండి వంటలతో జోడెద్దుల విగ్రహ ప్రతిమలకు నగలు అలంకరించి కేదారీశ్వరస్వామి వ్రతం ఉపవాసదీక్షతో నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా ఉండాలని కుటుంబ సభ్యులంతా ఆయురారోగ్యాలతో ఐష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని వేడుకున్నారు. దీంతో నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి.

ఊరేగింపు.. నిమజ్జనం..

సీతంపేటలో రెండో రోజు నేతకాని కులస్తుల దీపావళి వేడుకలలో భాగంగా బుధవారం కేదారీశ్వరస్వామి వ్రతం ముందు రేగడి మట్టితో తయారు చేసిన జోడెద్దుల విగ్రహ ప్రతిమలకు ప్రత్యేకంగా పిండి వంటలతో తయారు చేసిన (వ్యవసాయ పనిముట్లు నాగళి, కోల, కర్రు) నగలను అలంకరించి కోలాటాలతో ఆటపాటలతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకొని నిమజ్జనం చేస్తారు. ఇది కేవలం పురుషులు మాత్రమే జరుపుకునే రెండో రోజు ఘట్టం.


మహానంది పురస్కారాన్ని అందుకుంటున్న గంగు ఉపేంద్రశర్మ

మహానంది అవార్డుల ప్రదానోత్సవం

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోజా క్రియేషన్స్ 30వ వార్షికోత్సవాల సందర్భంగా దీపావళి పర్వదిన వేళ హనుమకొండ చౌరస్తాలోని వీనస్ ఫంక్షన్ హాల్‌లో వివిధ రంగాల ప్రముఖులకు కాకతీయ మహానంది పురస్కారాలను ప్రదానం చేసింది. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ సంగీతకారుడు, కర్నాటక గాత్ర విద్వాంసుడు ఆచార్య తిరుపతయ్య మాట్లాడుతూ.. సకల కళల సమాహారంగా ఓరుగల్లు విరాజిల్లుతున్నదన్నారు. రోజా క్రియేషన్స్ డైరెక్టర్ ఆలేటి శ్యాం సుందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకుడు గట్టు మహేశ్‌బాబు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా అనేక వైవిధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న రోజా క్రియేషన్స్‌ను అభినందించారు.

కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మను ఘనంగా సత్కరించి అర్చక రత్న బిరుదుతో కాకతీయ మహానంది పురస్కారాన్ని అందజేశారు. అదే విధంగా ప్రముఖ కవిగా, లయనిజం ద్వారా సామాజిక సేవ చేస్తున్న పొట్లపల్లి శ్రీనివాసరావు, ఓరుగల్లుకు సంగీత పరిజ్ఞానం నేర్పిన ప్రముఖ సంగీత విద్వాంసుడు సీతాల రఘువేందర్, రంగస్థల నటుడు, కళాపోషకుడు, కళా రాజేశ్వర్‌రావు, ప్రముఖ ఫొటోగ్రాఫర్, లయన్ వంగరి వేణుగోపాల్, ప్రముఖ అధ్యాపకురాలు ఎం.రాంబాయి, కొప్పుల రాకేశ్, ఉప్పనపల్లి రవికుమార్, బి.లక్ష్మీబాయి తదితరులకు కాకతీయ మహానంది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాల య జానపద గిరిజన విజ్ఞాన పీఠం డీన్ గడ్డం వెంకన్న, పోలీసు అధికారి రావేళ్ల రామారావు, ప్రముఖ వ్యాపారి పుల్లూరు మధు, వేణుమాధవ్, ప్రముఖకవి పిట్టవరం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రముఖ వ్యాఖ్యాత గాయకుడు తయ్యాల శ్రీధరాచారి స్వాగతం పలికారు.

మందులోళ్లా.. మాయలోళ్లా?

- నిబంధనలను ఉల్లంఘిస్తున్న మెడికల్ షాపుల నిర్వాహకులు
- యథేచ్ఛగా యాంటీ బయాటిక్స్, అన్‌వాంటెడ్ కిట్ల అమ్మకాలు
- మందులపై జీఎస్టీ తగ్గినా అమలు కాని వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



పోచమ్మమైదాన్ (వరంగల్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపుల మాయా జాలం కొనసాగుతోంది. అడిగేవారు, ఆపేవారు లేకపోవడంతో షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన రెచ్చిపోతున్నారు. ప్రజలకు నాసిరకం మందులు అంటగడుతూ బిల్లులు లేకుండా రూ.కోట్లలో వ్యాపారం కొనసాగిస్తున్నారు. అనేక మంది మెడికల్ షాపుల నిర్వాహకులు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. జ్వరం, జలుబు, దగ్గు తదితర జబ్బులకు విచ్చల విడిగా యాంటీబయాటిక్స్ అమ్ముతున్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మేవారు కొందరైతే, ప్రిస్క్రిప్షన్ పట్టుకొని వెళ్తే నాసిరకమైన మందులు అంటగట్టేవారు మరికొందరు. సేమ్ మందులు కాదుకదా అని ఎవరైనా ప్రశ్నిస్తే కేవలం కంపెనీ మాత్రమే తేడా, ఫార్ములా ఒక్కటే అని బుకాయిస్తున్నారు. నగర పరిధిలోనే సుమారు 1500 వరకు, జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల వరకు మెడికల్ షాపులు కొనసాగుతున్నాయి.

సుమారు 80 శాతానికి పైగా మెడికల్ షాపులలో ఫార్మసిస్టులే ఉండరు. కేవలం వారి సర్టిఫికెట్ పెట్టి మెడికల్ షాపుల అనుమతి పొంది పదో తరగతి చదివిన వారు మెడికల్ షాపులు నిర్వహిస్తున్నవారు కోకొల్లలు. అంతేకాక అనేక చోట్ల ఇష్టారీతిన యాంటీబయాటిక్స్, అన్‌వాంటెడ్ కిట్లు, స్టెరాయిడ్స్, పలురకాల సిరప్‌లు, మత్తు ఇంజక్షన్లు, ఇతర మందుల అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి.

అనేక చోట్ల మందులకు బిల్లలు ఇవ్వకుండా జీరో దందాలకు పాల్పడుతున్నారు. మందులు కొనుగోలు చేసిన వారి వద్ద డబ్బులు తీసుకోవడం తప్ప.. బిల్లు ఇవ్వడం అనేదే కనిపించడం లేదు. అధిక లాభాలకు ఆశపడి నాసిరకమైన మందులను అంటగట్టడమే ఇందుకు కారణమని పలువురు చెబుతున్నారు. యేటా రూ.కోట్లలో జీరో దందా కొనసాగుతోంది. అంతేకాక కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జీఎస్టీని సైతం అమలు చేయడం లేదు. పాత ధరలకే మందులు అమ్ముతున్నారు.

అధికారులెక్కడ ?

మెడికల్ మాఫియా ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు.ఔషధ నియంత్రణశాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వెలువడుతున్నాయి. పైగా మెడికల్ వ్యాపారానికి వారే అండగా ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. మెడికల్ షాపులలో కనీసం ఫార్మసిస్టులు లేకపోవడం కనబడటం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా డ్రగ్ కంట్రోల్ అధికారులు మేలుకొని మెడికల్ మాఫియాను అరికట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

విచ్చలవిడిగా దోపిడీ..

ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల మెడికల్ షాపుల హవా జిల్లాలో కొనసాగుతోంది. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో సైతం కార్పొరేట్ కంపెనీలు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నాయి. గల్లీకి ఒక షాపు చొప్పున అనేక చోట్ల వీరి దందా కొనసాగుతోంది. అందులో సొంత కంపెనీల మందులే రోగులకు అంటగడుతున్నట్లు విమర్శలు వెలువడుతున్నాయి. అంతేకాక పలు చోట్ల జనరిక్ మందులను సైతం బ్రాండెడ్ పేరుతో అమ్మకాలు సాగిస్తున్నారని, ఇందుకోసం డిస్కౌంట్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని తెలుస్తోంది.

సురేఖ మంత్రి పదవిపై

'కడియం' కుట్ర

- మాజీ ఉప ముఖ్యమంత్రి టి. రాజయ్య


మీడియాతో మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

హనుమకొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండా సురేఖ మంత్రి పదవిపై కడియం శ్రీహరి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఆరోపించారు. మంత్రి పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో శ్రీహరి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. సోమవారం హనుమకొండలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. రాష్ట్రంలో మంత్రి పదవుల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య గొడవలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ రెడ్డి నాయకులంతా కలిసి ఒక బీసీ మహిళ మంత్రి కొండా సురేఖపై కుట్రలు చేయడం దారుణమన్నారు. రెడ్డి నాయకులతో కలిసి మంత్రి పదవిని చేజిక్కించుకోవాలని కడియం శ్రీహరి ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కడియం శ్రీహరి గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోసి పార్టీని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్లారని రూ.3లక్షల కోట్లు అప్పులు చేసి ఒక కొత్త ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునితగోపీనాథ్ భారీ మెజార్టీతో గెలుస్తుందని, రాష్ట్రంలో నిజమైన మార్పు జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం అవుతుందని రాజయ్య తెలిపారు.

ఉర్సు దర్గా వద్ద ఫూలే విగ్రహం ధ్వంసం

మద్యం మత్తులో ఓ వ్యక్తి దుశ్చర్య

కరీమాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉర్సు దర్గా వద్ద బీసీల ఆరాధ్య దైవమైన మహాత్మజ్యోతిరావు ఫూలే విగ్రహాన్ని ఓ దుండగుడు ధ్వంసం చేశాడు. మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు సోమవారం అర్ధరాత్రి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన వంగరి రాహుల్‌గా నిర్ధారించారు. కాగా ఈ ఘటనపై పలువురు బీసీ సంఘాలు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ డిమాండ్ చేశారు. బీసీల సూర్తి ప్రదాత అయిన ఫూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని అన్నారు. ఇది హేయమైన చర్య అని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు డిమాండ్ చేశారు.

సొంత ఖర్చుతో మళ్లీ ఏర్పాటు చేయిస్తా : నన్నపునేని

ఉర్సు దర్గా వద్ద మహాత్మ జ్యోతిరావు ఫూలే విగ్రహం ధ్వసం కావడం బాధాకరమని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం ఆయన సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అదే స్థలంలో సొంత ఖర్చులతో జ్యోతిరావు ఫూలేతో పాటు, సావిత్రీబా ఫూలే కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.


ధ్వంసమైన జ్యోతిబా ఫూలే విగ్రహం

చిగురిస్తున్న ఆశలు

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఇందులో మొదటి దశలో 1,738 ఎకరాలు, రెండో దశలో 6,075 ఎకరాల భూమి అవసరం కాగా, పూర్తిస్థాయిలో భూసేకరణ చేశారు. ఈ రెండు దశల నుంచి ఎత్తిపోతలు జరుగుతున్నాయి. అయితే భూ చిక్కులన్నీ కూడా మూడో దశలో ఎదురవుతున్నాయి. ప్రాజెక్టులో కీలకమైన మూడో దశ నుంచే అత్యధికంగా 2,39,790 ఎకరాలకు సాగు నీరు అందనుంది. ఇప్పటికే దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌లోకి దేవాదుల నుంచి లిఫ్టుల ద్వారా గోదావరి జలాలు చేరుతున్నాయి. ఈ సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న వెల్‌టైప్‌లో నిర్మించగా, 141 మీటర్ల లోతులో పంపుహౌస్ ఏర్పాటు చేశారు.

ఇక్కడి నుంచే ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీటిని లిఫ్టుచేసి ఎగువన ఉన్న జిల్లాలకు గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. అయితే ఎంతో కీలకమైన ఈ దశలోనే భూసేకరణకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో రైతాంగానికి సాగునీరు అందటం లేదు. మొత్తం 33,451ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటి వరకు అధికారులు 30,582 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 2,869 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

ఇందులో ప్రధానంగా జనగామ జిల్లాలో 1,080, సిద్ధిపేట జిల్లాలో 935 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలో గల జనగామ నియోజకవర్గంలో 6,477 ఎకరాలకు గానూ, 5,492 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 985 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అలాగే స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో 8,035 ఎకరాలకు భూసేకరణకు 7,935 ఎకరాల భూమి సేకరించారు. ఇంకా 100 ఎకరాలు, పాలకుర్తి నియోజకవర్గంలో 4,706 ఎకరాలకు గానూ 3,939 ఎకరాల భూ సేకరణ చేయగా, ఇంకా 767 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. అలాగే వర్ధన్నపేటలో 168 ఎకరాలు, నర్సంపేట నియోజకవర్గంలో 133ఎకరాలు, భూపాలపల్లిలో 59ఎకరాలు, ములుగులో 179 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

భూ సేకరణపై ఇటీవల భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దేవాదుల, వరంగల్, హైదరాబాద్‌లో పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. దేవాదులను ప్రాధాన్యత ప్రాజెక్టుగా చేపట్టడంతోపాటు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, పనుల్లో జాప్యం జరగవద్దని ఆదేశించారు. దీంతో కెనాల్స్ పంపుహౌస్‌లు, మోటర్ల పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ, భూసేకరణపై అడుగులు పడటం లేదనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. భూసేకరణ పూర్తయితేనే చివరి ఆయకట్టు వరకు గోదావరి జలాలు అందించే వీలుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే భూసేకరణతో పాటు మూడో దశల్లో మొత్తం 2,430 కిలో మీటర్ల గ్రావిటీ కెనాల్స్ తవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 1,663.10 కిలో మీటర్లే పూర్తి చేశారు. ఇంకా 767కిలో మీటర్ల గ్రావిటీ కెనాల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అధికారులు కాలువల తవ్వకాలపై కూడా దృష్టి పెట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


నర్సంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో భోజనం, గుడ్డు వడ్డిస్తున్న వంట ఏజెన్సీ మహిళలు

వంట.. తంటా

కొండెక్కిన కోడిగుడ్ల ధర

- ఏజెన్సీలకు 7 నెలలుగా అందని రూ. కోటి 23 లక్షల బిల్లులు
- 1 నుంచి 8 తరగతి వరకు సెప్టెంబర్ భోజన బిల్లు పెండింగ్
- 9, 10 వ తరగతులకు విడుదల కాని 7 నెలల భోజన బిల్లులు
- అప్పులు తేలేక వంట ఏజెన్సీ కార్మికులకు తప్పని తిప్పలు


నర్సంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆకలి తీరుస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలకు సకాలంలో బిల్లులు అందడంలేదు. నెలనెలా అందాల్సిన బిల్లులను ఆరు, ఏడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో మహిళలు అప్పులు చేసి కోడి గుడ్లు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి వారానికి మూడు రోజులు భోజనంలో గుడ్డును పిల్లలకు పెడుతున్నారు. బిల్లులు సకాలంలో రాక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత కొన్ని నెలలుగా పెద్ద మొత్తంలో బిల్లుల బకాయిలు అందక వంటఏజెన్సీల నిర్వాహకులు అప్పులు తీర్చలేక పడరాని పాట్లు పడుతున్నారు. పెరిగిన ధరలతో మధ్యాహ్న భోజనం నిర్వహణ వారికి భారంగా మారుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన బిల్లులు విడుదల కాక మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు పడరానిపాట్లు పడుతున్నారు.

వరంగల్ జిల్లాలో 546 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 27,168 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలవుతుంది. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి భోజనం రూ.6.78, 6నుంచి 8వ తరగతి వరకు విద్యార్థికి రూ:10.17, 9, 10వ తరగతి విద్యార్థికి రూ:10.67 వంతున్న వంటఏజెన్సీ మహిళలకు చెల్లిస్తున్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు భోజన బిల్లులు ఆగస్టు వరకు ప్రభుత్వం చెల్లించారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9, 10 వతరగతి వరకు భోజన బిల్లులు మార్చి నుంచి పెండింగ్‌లో ఉండడంతో వంటఏజెన్సీ మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఒక్కో కోడిగుడ్డుకు రూ.6 వంతున గుడ్డు బిల్లు సపరేటుగా అందిస్తుంది. 1 నుంచి 8 వ తరగతి వరకు చదివే విద్యార్థులకు సంబంధించి మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలకు భోజన బిల్లులు ఆలస్యమైనా సక్రమంగా అందుతూ సెప్టెంబరు నెల బిల్లు మాత్రమే పెండింగ్ ఉంది. 9, 10 వతరగతి విద్యార్థులకు సంబంధించిన భోజన బిల్లులు మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎగ్ (కోడి గుడ్లు) బిల్లులు మాత్రం నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో వంటఏజెన్సీ మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులకు మెనూ ప్రకారం వారంలో మూడు సార్లు కోడి గుడ్డును అందిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధరలు కొండెక్కాయి. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ:6 చెల్లిస్తుంది. మార్కెట్‌లో మాత్రం గుడ్డు ధర రూ.6 నుంచి రూ.7 ధర పలుకుతుంది. నిత్యావసర సరుకుల ధరలు సైతం పెరగడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అందని బిల్లులు

జిల్లాలోని 13 మండలాల్లో 546 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 27,168 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. గత మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలలకు సంబంధించిన జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని వంట ఏజెన్సీ మహిళలకు నెలకు సుమారు రూ.17లక్షల 60 వేల మేరకు ఎగ్ బిల్లులు అందిస్తుంటారు. గత మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలలకు సంబంధించిన ఎగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఏజెన్సీల మహిళలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



వీరులకు వందనం

ఘనంగా పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం




వెంకటాపురంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఆర్పీఎఫ్ డీఎస్పీ వెంకటకృష్ణ, పోలీసు అమరవీరుల స్థూపం వద్ద వాజేడు పోలీసులు

వాజేడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని వాజేడు పోలీసులు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద ఎస్సై జక్కుల సతీష్ గౌరవ వందనం సమర్పించి నివాళులు అర్పించారు. సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు సైతం స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే మొదటి వ్యక్తుల్లో పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయమని అన్నారు. అదేవిధంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై లతీష్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ జగన్నాథరాజు, నాయకులు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో పోలీస్‌శాఖ, మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్టు, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని సీఆర్పీఎఫ్ డీఎస్పీ వెంకటకృష్ణ ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి డాక్టర్ నరేష్, మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మురళి, చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు చిడెం రవికుమార్, చిడెం అయ్యప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో బెగ్లూర్, బొమ్మాపూర్‌కు చెందిన గ్రామస్థులు పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కట్కం అశోక్, యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసేందుకు మారుమూల మండలం నుంచి యువకులు, నాయకులు రావడం పట్ల ఎస్పీ కిరణ్ ఖరే, డీఎస్పీ సత్యనారాయణ వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో బుర్రి శివరాజు, సాంబయ్య, ఆకుల శ్రీధర్, మహేందర్, సుద్దాల పవన్ కళ్యాణ్, హరీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో..

కాటారం (ఆంధ్రజ్యోతి):పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు రక్తదానం చేశారు. డీఎస్పీ సూర్యనారాయణ నేతృత్వంలో సీఐ నాగార్జునరావు, ఎస్సైలు శ్రీనివాస్, రాజశేఖర్, మానస ఆధ్వర్యంలో అమరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ జిల్లా కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి హాజరై పలువురు కాంగ్రెస్ నేతలు రక్తదానం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా నేత కడారి విక్రమ్ 26వ సారి రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. పోలీసులు శాంతి, భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలిన అమరులను స్మరించుకునే అవకాశం దక్కిందని నేతలు నివాళులర్పించారు. రక్తదానం చేసిన వారికి ఎస్పీ కిరణ్ ఖరే, ఇతర పోలీసు అధికారులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రక్తదానం చేసిన వారిలో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నేతలు, యువకులు భూపెల్లి రాజు, ఉంసింగ్, విక్రమ్, ఆత్మకూరి కుమార్, రాంనారాయణ, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, మధు, ప్రవీణ్, రంజిత్, ఎం.డి.అజ్జర్, చరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



కాటారంలో రక్తదానం చేసిన మాజీ ఎంపీపీ సమ్మయ్య, నేతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

కోతుల బెడద నుంచి కాపాడండి : సీపీఎం



ఫారెస్ట్ రేంజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఏటూరునాగారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కోతుల బెడద నుంచి ప్రజలను, పంటలను కాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొప్పుల రఘుపతి డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని అటవీ శాఖ రేంజ్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం రేంజర్ అబ్దుల్ రహ్మాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ మండలంలో కోతుల బెడద రోజురోజుకూ ఎక్కువైందన్నారు. దీంతో ప్రజలు, రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పదేళ్లుగా ఈ సమస్య ఉందని, ఇది రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోందని అన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్డీ. దావూద్, టి. రవి, జే. దామోదర్, మండల కమిటీ సభ్యులు ఎమ్డీ. యాకూబ్, టి. కృష్ణయ్య, జె. రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

ములుగు రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోడు భూములు సాగు చేసుకునే రైతులు వానాకాలానికి సంబంధించిన పంట వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల ఉప అధికారి హరీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు జిరాక్స్ భూమి వివరాలతో మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. వడ్లు, పత్తి, మొక్కజొన్న తదితర పంటల కొనుగోలు, పంట నష్టం జరిగినప్పుడు సహాయం పొందేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయని తెలిపారు. పత్తి పంట కొనుగోలు సమయంలో కిసాన్ కపాస్ యాప్‌లో రిజిష్టర్ అయ్యేందుకు, పంట కొనుగోలు సమయంలో స్లాట్ బుక్ చేసుకున్నాక ఓటీపీకి ఫోన్ నెంబర్ ఇవ్వాలని సూచించారు. పాత ఫోన్ నంబర్లు మార్పులు ఉంటే సరిచేసుకోవాలని పేర్కొన్నారు.

ఉచితంగా కంటి పొర శస్త్ర చికిత్సలు

ఏటూరునాగారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మండలాల ప్రజల కోసం హైదరాబాద్ శంకర నేత్రాలయ, సంజోష్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కంటి పొర ఉచిత శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంజోష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నటుడు సంజోష్ హరి తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఈనెల 22 నుంచి 28 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. అవసరం ఉన్న వారికి 26 నుంచి 30వ తేదీ వరకు కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు.

గ్రామీణ క్రీడలే ప్రతిభకు గీటురాయి

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న పుట్ట మధు

కాటారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల ప్రతిభకు గ్రామీణ క్రీడలే గీటురాయి అని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మండలంలోని శంకరంపల్లిలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాంపియన్స్ ట్రోఫీ సీజన్-3 క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. బహుమతుల ప్రదానోత్సవానికి పుట్ట మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీఆర్ఎస్ నేతలు, నిర్వాహకులతో కలిసి విజేత, రన్నరప్‌గా నిలిచిన జట్లకు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు. నగదు బహుమతులను అందించిన కామిడి ప్రమోద్‌ను అభి నందించారు. గ్రామీణప్రాంత యువత చెడు వ్యసనాల బారిన పడకుండా శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలిగించే క్రీడల్లో పాల్గొనాలన్నారు. గ్రామీణ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు జక్కు రాకేష్, తోట జనార్ధన్, పూర వెంకటేశ్వర్‌రావు, ఐలి రాజబాపు, నరివెద్ది శ్రీనివాస్, రాజమౌళి, రాజబాబు, శ్రావణ్, వెంకటస్వామి, సంతోష్, రాజేంద్రాచారి, బండం లక్ష్మారెడ్డి, రమేష్, ప్రమోద్, విక్రమ్, బానయ్య, తూటి మనోహర్, మురారి, వంశీ, సమ్మయ్య, బాలరాజు, ప్రశాంత్, మహేష్, శంకర్, జావీద్‌ఖాన్, దేవేందర్, రాజబాపు పాల్గొన్నారు.

‘నాటు’.. చేటు

- యథేచ్ఛగా గుడుంబా దందా
- గ్రామ శివారులు, వాగులు, వంకలే స్థావరాలు
- అటవీ ప్రాంతాలే అడ్డాలు
- ప్యాకెట్ల రూపంలో జోరుగా రవాణా



గుడుంబా తయారీ కోసం చక్కెర పానకం పులియబెట్టిన డ్రమ్ములు

కాటారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుడుంబా మహమ్మారి నిండు జీవితాలను గుల్ల చేస్తోంది. ప్రభుత్వం దీనిపై ఉక్కు పాదం మోపుతున్నా నిర్మూళన సాధ్యం కావడం లేదు. కాటారం డివిజన్ పరిధిలో దీని వ్యాపారం జోరుగా నడుస్తోంది. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించినా గుడుంబా (నాటుసారా) తయారీ యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది.

రూటు మార్చిన తయారీదారులు

గుడుంబా తయారీదారులు రూట్ మార్చారని తెలుస్తోంది. గతంలో లాగా ఇళ్ల వద్ద గుడుంబాను తయారు చేయడం లేదు. ఇళ్లతో పాటు గ్రామాల శివార్లలోని పత్తి చేన్లు, వాగులు, ఒర్రెలు, అటవీ ప్రాంతాల్లో నాటుసారా తయారీ చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారుల కళ్లు కప్పడానికి గుడుంబా స్థావరాలను ఎప్పటికప్పుడు మారుస్తూ తమ వ్యాపారాన్ని మూడు పూలు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. కొంతకాలం గుడుంబా తయారీ, విక్రయాలు నియంత్రణలో ఉండగా మళ్లీ విజృంభిస్తున్నాయి.

ప్రభుత్వం గుడుంబా తయరీదారులకు పునరావాసం కల్పించడానికి ఒక్కో వ్యక్తికి రూ. 2లక్షల విలువైన పలు రకాల యూనిట్లు మంజూరు చేసినా వాటిని తీసుకొని కూడా కొందరు పాత వృత్తికే పరిమితమవుతున్నారని తెలుస్తోంది. పచ్చని పల్లెల్లోని పేదల జీవితాల్లో గుడుంబా రక్కసి చిచ్చు పెడుతోందని ప్రభుత్వం గుడుంబాను పూర్తిగా నిషేధించి ఏళ్లు గడుస్తున్నా కొంత మేర తయారీ తగ్గినా పూర్తి స్థాయిలో మాత్రం నియంత్రణలోకి రావడం లేదు. కొంతమంది గుడుంబా తయారీనే ఫుల్‌టైం బిజినెస్‌గా చేసుకున్నారు. నాటుసారాను తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. దీని కోసం వాగులు, వంకల వద్ద పెద్ద పెద్ద ప్లాస్టిక్ డ్రమ్ముల్లో బెల్లం పాన కాన్ని పులియబెడుతున్నారు. గతంలో గుడుంబా తయారీకి ఇళ్ల వద్ద పెద్ద కుండలు ఉపయోగించేవారు. ప్రస్తు తం డ్రమ్ములతోనే సారా కాస్తు న్నారు. కాటారం, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండలాల్లోని పలు గ్రామాల పరిధిలో, వాగులు, వంకలు, అటవీప్రాంతాల శివారుల్లో గుడుంబా తయారీ సాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

గుట్టు చప్పుడు కాకుండా రవాణా..

గుడుంబాను తయారు చేయడంలో ఎంతో గోప్యతను పాటిస్తున్నారు. తయారీ చేసిన గుడుంబాను కొందరు క్యాన్లు, బాటిళ్లలో పోసి గుట్టు చప్పుడు కాకుండా రవాణా చేస్తూ తమ టాస్క్‌ను పూర్తిచేసి సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. మరికొందరు గతంలో ఎన్టీఆర్ ప్రభుత్వం వారుణివాహిని పేరిట ప్యాకెట్ల రూపంలో అమ్మినట్లు గుడుంబాను 60ఎంఎల్, 90 ఎంఎల్ ప్యాకెట్లుగా తయారీ చేసి ఎవరికీ తెలియకుండా వాహనాల ద్వారా తరలిస్తున్నారని సమాచారం. పెద్ద మొత్తంలో ఈ ప్యాకెట్లను తీసుకొని ఫ్యామిలీతో ఊరికి వెళ్తున్నట్లు బయల్దేరి యథేచ్ఛగా రవాణా చేస్తున్నారని తెలిసింది. డివిజన్‌లో నాటుసారా తయారీదారులంతా అధికంగా గుడుంబా ప్యాకెట్లను తయారు చేసి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. గుడుంబా తయారీకి అవసరమయ్యే బెల్లం రవాణాపై నిఘా ఉన్నప్పటికీ స్మగ్లర్లు తెలివిగా బోధన్, కామారెడ్డి, పెద్దపల్లి, మంచిర్యాల, చెన్నూరు, భూపాలపల్లి తదితర ప్రాంతాల నుంచి నేరుగా తయారీదారుల డెన్‌లకు సరఫరా చేయిస్తున్నారని సమాచారం. అధికశాతం తయారీదారులు బెల్లంతో కాకుండా చక్కెర, ఈస్ట్‌తో గుడుంబా తయారీ చేస్తున్నట్లు తెలిసింది. ఇలా అమ్ముతున్న నాటుసారాను తాగి కొందరు టీబీ వ్యాధిన బారినపడి చిన్న వయస్సులోనే తనువు చాలిస్తున్నారు. ఇటీవల అధికారులు పట్టు సడలించడంతోనే మళ్లీ ఎక్కడ పడితే అక్కడ గుడుంబా తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

కాటారం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఐదు మండలాలుండగా ఎక్సైజ్ సీఐ పోస్టు గత ఏడాదిన్నరగా ఖాళీగా ఉండగా, ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, ఐదుగురు కానిస్టేబుళ్లు మాత్రమే ఉన్నారు. దీంతో వారు మద్యం అమ్మకాలపైనే దృష్టి పెడుతుండగా గుడుంబా నియంత్రణ జరగడు లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అడపదడపా స్థావరాలపై దాడులు జరుపుతున్నా పూర్తిస్థాయిలో నియంత్రణ జరగడంలేదని తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి కాటారం ఎక్సైజ్ సర్కిల్‌లో అధికారులు, సిబ్బంది సంఖ్యను పెంచడంతో పాటు పూర్తి స్థాయిలో గుడుంబాను అరికట్టేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పటిష్ఠంగా శాంతి భద్రతల అమలు

చల్ల రాజు
• వెంకటాపూర్ ఎస్సై

ఫేస్‌టూఫేస్



ప్రశ్న : శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి కార్యాచరణ అమలు చేస్తున్నారు?

జవాబు : ప్రజా సంబంధాలను మెరుగుపరచుకోవడం ద్వారా గ్రామాల నుంచి సత్వర సమాచారం అందుతోంది. దీంతో సత్వరమే అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దుతున్నాం.

ప్రశ్న : చోరీల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

జవాబు : వెంకటాపూర్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రాత్రి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తున్నాం. వాహనాల తనిఖీ చేపడుతూ పాత నేరస్థులు, అనుమానితుల కదలికలపై నిఘా పెంచాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు సూచిస్తున్నాం.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణ ఎలా ఉంది?

జవాబు : ములుగు- వెంకటాపూర్ జాతీయ రహదారిపై ప్రతినిత్యం తనిఖీలు చేపడుతున్నాం. ఈ ప్రాంతంలో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాం. ప్రమాద సూచిక బోర్డులతోపాటు పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న : ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశాం. 400మంది వాహనదారులకు జరిమానా విధించాం.

ప్రశ్న: తాగి వాహనాలు నడుపుతున్న వారిపై తీసుకుంటున్న చర్యలు?

జవాబు : మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

- వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి)

కిసాన్ కపాస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు అవగాహ కల్పిస్తున్న ఏవో కల్యాణి

టేకుమట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పత్తిని మద్దతు ధరకు విక్రయిం చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ కపాస్ యాప్‌ను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి కల్యాణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు కిసాన్ కపాస్ యాప్ గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో యాప్‌కు సంబం ధించిన కరపత్రికలను విడుదల చేసి రైతులకు అందజేశారు. రైతులు పండించిన పత్తి పంటను మద్దతు ధరకు విక్రయించుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్‌లో తమ ఆధార్, భూమి వివరాలు, పంట వివరాలు నమోదు చేయడంతోపాటు విక్రయాల కు స్లాట్ బుక్ అవుతుందన్నారు. తద్వారా తనకు నచ్చిన మార్కెట్‌లో పత్తి ని విక్రయించుకోవచ్చన్నారు. అన్ని గ్రామాల్లో రైతులకు ఈ యాప్‌పై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

గురుకులాల బోధనేతర సిబ్బంది ముందస్తు అరెస్టు

కాటారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకులాల బోధనేతర సిబ్బందిని పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. తమ సమస్యలను పరిష్క రించాలని కోరుతూ హైదరాబాద్‌లో జరగనున్న నిరసన కార్యక్రమానికి హాజర య్యేందుకు సిద్ధం అవుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు.



పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన గురుకుల బోధనేతర సిబ్బంది

ఏసీబీ అధికారులమంటూ టోకరా

- ఆర్టీఏ అధికారులకు ఫోన్‌లో బెదిరంపులు
- రూ.10లక్షల 20 వేలు అర్పించుకున్న ఎంవీఐలు
- ఏసీబీ డీఎస్పీని ఆశ్రయిచిన బాధితులు

వరంగల్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారులమని చెప్పి కొందరు వ్యక్తులు వరంగల్ ఆర్టీఏ అధికారులకు ఫోన్ చేసి రూ.10లక్షల 20వేలు లాగేసుకున్నారు. ఫోన్ కాల్‌పై ఓ ఎంవీఐకి అనుమానం రావడంతో వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో తాము నకిలీ ఏసీబీ అధికారుల చేతుల్లో మోసపోయామని గ్రహించారు. వివరాల్లోకి వెళితే..

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఆర్‌టీఏ చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించి ఆర్టీఏ అధికారుల అవినీతిని గుర్తించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట వరంగల్ ఆర్టీఏ అధికారులకు గుర్తు తెలియని వ్యక్తులు 98868 26656, 98804 72272, 95919 38585 నెంబర్ల నుంచి ఫోన్‌చేశారు. ఆర్టీఏ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అంతా తెలుసని, అరెస్టు కాకుండా ఉండాలంటే డబ్బులు పంపించాలని ఎంవీఐలను బెదిరించగా దశల వారీగా రూ.10లక్షల 20 వేలను గుర్తు తెలియని వ్యక్తుల అకౌంట్‌ల్లోకి జమ చేశారు. అయితే ఎంవీఐలలో ఒక అధికారికి ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తిపై అనుమానం రాగా, వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను ఆశ్రయించి జరిగిన విషయాన్ని తెలియజేశారు. అలాంటి ఫోన్స్ తాము చేయమని, గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో మిమ్మల్ని మోసం చేశారని చెప్పడంతో పాటు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు. కాగా, తాము మోసపోయిన విషయం ఇతరులకు తెలియకుండా గుట్టుగా ఉంచేందుకు ఆర్టీఏ అధికారులు యత్నించారు. ప్రస్తుతం ఈ విషయంలో స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, త్వరలోనే పూర్తి విషయాలు చెబుతామని దాటేశారు. అయితే మిల్స్‌కాలనీ పోలీసులు మాత్రం ఈ అంశంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని అంటున్నారు. ఈ విషయంపై ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను వివరణ కోరగా.. ఇద్దరు ఎంవీఐలకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే డబ్బులు పంపించారని చెప్పారు.

దంపతులకు గాయాలు

లింగాలఘణపురం, అక్టోబ రు 21 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం గుమ్మడవెల్లి వద్ద మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు దంపతులు గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. గు మ్మడవెల్లికి చెందిన గంగయ్య, యాదమ్మ దంప తులు మోటార్‌సైకిల్‌పై వ్యవసాయబావి వద్ద కు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టిం ది. ఈప్రమాదంలో గాయపడ్డ దంపతులను 108 సిబ్బంది గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జయశంకర్
Jayashankar Aco - 9985426984,
Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram
SR - 7673960447 ACM - 9985411664